ప్రజా విశ్వంభర V3 NEWS

డీగ్లామరైజ్డ్ పాత్రలో ప్రియాంక మోహన్..

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్-శింబు కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రం 'అరసన్'. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నై పరిసర ప్రాంతాలలో శరవేగంగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రా అండ్ రియలిస్టిక్ కథలో ప్రియాంకా మోహన్ పాత్ర ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో హీరో శింబు- ప్రియాంకా మోహన్ కాంబినేషన్‌లో వచ్చే కొన్ని అత్యంత కీలకమైన రొమాంటిక్ సీన్లు, భావోద్వేగ సన్నివేశాలను డైరెక్టర్ వెట్రిమారన్ ఎంతో వైవిధ్యంగా తెరకెక్కిస్తున్నారని టాక్. అయితే వెట్రిమారన్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. కథను మలుపు తిప్పేలా బలమైన పాత్రలుగా ఉంటాయనే సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కూడా ప్రియాంకా మోహన్ ఒక విభిన్నమైన, డీగ్లామరైజ్డ్, పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు టాక్. తన సహజసిద్ధమైన నటనతో మెప్పించే ప్రియాంకకు, ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోనుందని అభిమానులు భావిస్తున్నారు. కాగా.. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శింబు, ప్రియాంకలతో పాటు విజయ్ సేతుపతి, సముద్రఖని కీలక పాత్రలలో నటిస్తున్నారు. కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

'కరుప్పు'.. విజయ్ కథ వినడంతోనే మొదలైంది: ఆర్జే బాలాజీ

నటుడు సూర్య హీరోగా ఆర్జే బాలాజీ తెరకెక్కించిన యాక్షన్ మూవీ 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'గా విడుదలైంది. 2026 మే 15న థియేటర్లలోకి వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఈ సినిమా విజయంలో నటుడు, తమిళనాడు సీఎం దళపతి విజయ్ పాత్ర ఉందని ఇటీవల దర్శకుడు చెప్పడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. తాజాగా ఆయన దీనిపై క్లారిటీ ఇచ్చారు.ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో బాలాజీ మాట్లాడుతూ.. "విజయ్ సర్ వల్లే ఈ మూవీ సూర్యగారితో చేసే అవకాశం నాకు వచ్చింది. తొలుత ఈ కథను విజయ్‌కు చెప్పాను. కొన్నికారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. సూర్యలాంటి పెద్ద స్టార్ వద్దకు నేరుగా వెళ్లి కథ చెప్పడమన్నది అంత త్వరగా అయ్యే పని కాదు. ఒకరోజు డ్రీమ్ వారియర్ పిక్చర్స్ వాళ్లు నాకు ఫోన్ చేసి.. 'విజయ్‌కి చెప్పిన కథను సూర్యకి చెబుతారా' అని అడిగారు. దాంతో నేను సూర్యను కలిశా. నేను, విజయ్ కలిసి సినిమా చేయకపోయినా, నా గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈరోజు నేను ఈ స్థితిలో ఉండటానికి కారణం సూర్య. కానీ ఈ విషయానికి తలుపు తెరిచింది మాత్రం విజయ్. స్క్రిప్ట్ బాగుందని విజయ్ మా ఆవిడకు కూడా చెప్పారు' అని బాలాజీ తెలిపారు.విజయ్‌తో సినిమా చేయాల్సి ఉన్నా షెడ్యూల్ సమస్యల వల్ల కుదరలేదని కూడా ఆయన వెల్లడించారు. ఇటీవలే 'కరుప్పు' విజయం తర్వాత, ఆ సినిమా ప్రయాణం విజయ్ కథ వినడంతోనే మొదలైందని బాలాజీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ సినిమాలో సూర్యతో పాటు త్రిష, ఆర్జే బాలాజీ, ఇంద్రాన్స్, అనఘ మాయ రవి, నటరాజన్ సుబ్రమణ్యం, శ్వాసిక, శివద తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతోంది.

'అమ్మ'లో సంక్షోభం..
మొత్తం కార్యవర్గం రాజీనామా

మలయాళ చిత్రసీమకు చెందిన నటీనటుల సంఘం 'అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీఆర్టిస్ట్స్'లో సంచలనం చోటుచేసుకుంది. అంతర్గత విభేదాలు, ఆర్థిక లావాదేవీలు, స్పాన్సర్‌షిప్‌లకు సంబంధించిన వివాదాలు ముదరడంతో 'అమ్మ' అధ్యక్షురాలు, నటిశ్వేతా మేనన్ సహా కార్యవర్గ సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. మరోవైపు శ్వేతా మేనన్ 'అమ్మ' సభ్యత్వానికి కూడా తాను రాజీనామా చేసినట్లు ప్రకటించారు.గతేడాది ఆగస్టులో జరిగిన ఎన్నికల తరువాత బాధ్యతలు స్వీకరించిన పరిపాలన కమిటీ ఏడాది కూడా పూర్తి కాకముందే వైదొలగడం గమనార్హం. ఆ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా శ్వేత, డబ్బింగ్ కళాకారిణి కుక్కు పరమేశ్వరన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.తద్వారా 'అమ్మ' చరిత్రలోనే తొలిసారిగా రెండు అత్యున్నత పదవులు చేపట్టిన మహిళలుగా ప్రత్యేకత చాటారు. అయితే ఇటీవల మాజీ జాయింట్ సెక్రటరీ అన్సిబా హసన్ కమిటీకి రాజీనామా చేయడం, ఆసమయంలో ఆమెకార్యవర్గంపై చేసిన తీవ్ర ఆరోపణలతో 'అమ్మ'లో సంక్షోభం ముదిరింది. కార్యవర్గంలోని కొందరు సభ్యులుతనను వేధిస్తున్నారని, మతపరమైన కోణంలో తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్సిబా సంచలన ఆరోపణలు చేశారు. 'అమ్మ' కార్యక్ర మాలకుమత సంస్థలను స్పాన్సర్లుగా తీసుకొచ్చారని, దాన్ని ప్రశ్నించినవారిని ఒంటరిని చేసి వేధిస్తున్నారనిఆమె పేర్కొన్నారు. ఉపాధ్యక్షురాలు లక్ష్మీప్రియ కూడా సంస్థ పనితీరులో పారదర్శకత లోపించిందని ఆరోపించారు.ఈ నేపథ్యంలోనేకార్యవర్గం మొత్తం వైదొలగింది.

మమ్మల్ని తొలగించేందుకు కుట్రపన్నారు..

రాజీనామా అనంతరం శ్వేతా మేనన్ మాట్లాడుతూ..తమ కమిటీని తొలగించే దురుద్దేశంతో కొందరు ఎజెండాను అమలు చేసినట్లు ఆరోపించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మందికి కమిటీ బాధ్యతలను అప్పగించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. తన పాలన లో సంస్థ ఆర్థిక లావాదేవీలన్నీ పారదర్శకంగా ఉన్నాయన్నారు. గత కమిటీలో ఉన్న బాబూరాజ్ పాలనలోనే కొన్ని ఆర్థిక, పరిపాలన సంబంధిత అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

ఒక్క సినిమాకు రూ.325 కోట్లు..
రజనీకాంత్‌ను దాటేసిన బాలీవుడ్ స్టార్



ఒకప్పుడు సినిమా హీరోలకు రూ.10కోట్ల పారితోషికం ఇస్తున్నారంటేనే ఆశ్చర్యపోయే వాళ్లం.90ల్లో రూ.కోటిపారితోషికం తీసుకుని అగ్రనటులు చిరంజీవి, కమల్ హాసన్, శ్రీదేవి రికార్డు సృష్టించారు. గత దశాబ్దకాలంగా దక్షిణాది సినిమాల స్థాయి పెరిగింది. నటులు రజనీకాంత్, యశ్, అల్లు అర్జున్ రూ.200 కోట్లకు పైగా పారితోషికం తీసుకున్నట్టు టాక్.అయితే 2026లో ఈలెక్కలన్నీ మారిపోయాయి.భారత్‌లో, ఒకే ప్రాజెక్టుతో వాటాల ద్వారా అత్యధిక లాభాలు అందుకున్న నటుడిగా రణ్‌వీర్‌సింగ్ రికార్డుసృష్టించారు. అయితే దీన్నే మనం పారితోషికం అని కూడా అనుకోవచ్చు. 'ధురంధర్' సినిమాతో ఆయన ఈ అరుదైన రికార్డు సాధించారు. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.3,200 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఇండియాలోనే రూ.1,900 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించింది. . అయితే ఈ ప్రాజెక్టు కోసం రణ్‌వీర్ ముందుగా ఎలాంటి పారితోషికం తీసుకోలేదు. లాభాల్లో వాటా తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. సినిమా నిర్మాణ వ్యయం పెరిగినప్పుడు తన సొంత డబ్బు కూడా పెట్టారు. ఫలితంగా లాభాల్లో రణ్‌వీర్ వాటా భారీగా పెరిగింది. థియేట్రికల్ బోనస్, డిజిటల్, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ నుంచి వచ్చిన ఆదాయంలో రణ్‌వీర్ వాటా రూ.325 కోట్లకు చేరినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. లాభాల్లో ఎక్కువ వాటాను జియో స్టూడియోస్, ఆదిత్య ధర్ బీ62 స్టూడియోస్ సొంతం చేసుకున్నాయి. ఒక్క ప్రాజెక్ట్‌కు భారతీయ నటుడు ఇంత భారీ మొత్తం అందుకోవడం ఇదే తొలిసారిగతంలో ఈ రికార్డు సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై ఉండేది. 'జైలర్' (2024) సినిమాకు ఆయన రూ.250 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ (పుష్ప 2), ప్రభాస్ (కల్కి 2898 ఏడీ), చిత్రాలకు రూ.200 కోట్లకు పైగానే అందుకున్నట్లు తెలుస్తోంది. 2023లో షారుక్ ఖాన్ 'జవాన్', 'పఠాన్' ఒక్కో చిత్రానికి రూ.200 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. ఇప్పుడు వీరందరినీ దాటేసి రణ్‌వీర్ సింగ్ దేశంలో అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడిగా అగ్రస్థానంలో నిలిచారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో
తారల సందడి..!

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సినీతారలు సందడి చేశారు. బాలీవుడ్, టాలీవుడ్ తారలు తమ సందేశాలను సోషల్ మీడియా వేదికగా పంచుకొన్నారు. ముంబైలో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ,కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే థీమ్‌తో ఈ కార్యక్రమంజరిగింది.మరోవైపుఇండియన్ యోగాఅసోసియేషన్ అంబాసిడర్, నటుడు విద్యుత్ జమ్వాల్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో పంచుకొన్నారు. "తల్లిదండ్రులు ఆరోగ్యంపై దృష్టిపెట్టినప్పుడే.. పిల్లలు కూడా ఆరోగ్యంపై శ్రద్ధ పెడతారని పేర్కొన్నారు. హరియాణాలోని గురుగ్రామ్‌లో జరిగిన కార్య క్రమంలో బాలీవుడ్ తార శిల్పాశెట్టి పాల్గొన్నారు. మరోవైపు టాలీవుడ్ నటి శ్రీలీలా మీడియా తో మాట్లాడుతూ..నేటి జీవనంలో ఒత్తిడి ఓభాగమని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కోవడానికి హెల్తీ లైఫ్‌స్టైల్ అవసరమన్నారు. ఇందుకోసం యోగాని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

మహిళల టీ20 వరల్డ్ కప్ భారత్‌కు తొలి ఓటమి..
సౌతాఫ్రికా ఘన విజయం

విశ్వంభర, స్పోర్ట్స్: మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం మాంచెస్టర్‌లో జరిగిన గ్రూప్-ఏ ఉత్కంఠభరిత పోరులో సౌతాఫ్రికా మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో సౌతాఫ్రికా తన ప్రపంచకప్ ప్రచారంలో ఆశలు సజీవంగా ఉంచుకోగా, టోర్నీలో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్‌కు బ్రేక్ పడింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 158 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (17), షెఫాలీ వర్మ ఆరంభంలో ధాటిగా ఆడినప్పటికీ.. సౌతాఫ్రికా బౌలర్లు కట్టడి చేయడంతో మిడిల్ ఓవర్లలో భారత్ వరుస వికెట్లు కోల్పోయింది. తన కెరీర్‌లో చారిత్రాత్మక 200వ టీ20 మ్యాచ్ ఆడుతున్న భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 24 పరుగులు చేయగా, దీప్తి శర్మ 29 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో షబ్నిమ్ ఇస్మాయిల్, మారిజన్ కాప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు భారత యువ బౌలర్ శ్రీచరణి (3 వికెట్లు) ఆరంభంలోనే రెండు షాక్‌లు ఇచ్చింది. అయితే, ఆ తర్వాత సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ మారిజన్ కాప్ (45 బంతుల్లో 81 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగింది. ఆమెకు తోడుగా తజ్మిన్ బ్రిట్స్ (40) రాణించడంతో మూడో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదైంది. చివరికి క్లో ట్రయాన్ బౌండరీతో సౌతాఫ్రికా విజయాన్ని ఖరారు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో

అదరగొట్టిన మారిజన్ కాప్ సౌతాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించింది.

వైభవ్ విధ్వంసం..
ముక్కోణపు సిరీస్ ఛాంపియన్‌గా ఇండియా ఎ

విశ్వంభర, స్పోర్ట్స్: శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఇండియా 'ఎ' జట్టు ఘన విజయంతో టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో శ్రీలంక »A'పై 66 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. యువ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో భారత్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటింది. టాస్ అనంతరం తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 'ఎ' నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఈ ఇన్నింగ్స్‌కు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. కేవలం 29 బంతుల్లోనే 10 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 94 పరుగులు చేసి శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి తోడుగా తిలక్ వర్మ 67 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడగా, రుతురాజ్ గైక్వాడ్ (40), ప్రియాంశ్ ఆర్య (39), అనుకుల్ రాయ్ (39), కుమార్ కుశాగ్ర (36), విప్రాజ్ నిగమ్ (27) పరుగులతో జట్టుకు బలమైన పునాది వేశారు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక..

378 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 'ఎ' జట్టు భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనకు తలొగ్గింది. 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటై పరాజయం పాలైంది. వనుజ సహన్ 62, సదీర సమరవిక్రమ 52 పరుగులతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. విజయకాంత్ వియాస్కాంత్ (39), సహన్ అరచ్చిగే (38), నిరోషన్ డిక్వెల్లా (25) కొంత ప్రతిఘటన చూపినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్, విప్రాజ్ నిగమ్ తలా మూడు వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. అనుకుల్ రాయ్ రెండు వికెట్లు సాధించగా, అశోక్ శర్మ, తిలక్ వర్మ చెరో వికెట్ తీశారు. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్, బౌలర్ల సమిష్టి కృషితో భారత్ 'ఎ' ఫైనల్లో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసి ముక్కోణపు సిరీస్ ట్రోఫీని ముద్దాడింది.

టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన పొలార్డ్..
గేల్ రికార్డు బద్దలు

వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ కీరన్ పొలార్డ్ టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించాడు.పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అవతరించాడు. ఇంతకుముందు ఈ ఘనత తన సహచరుడు క్రిస్ గేల్‌పేరిట ఉండేది.గేల్ 436 టీ20ల్లో14,562 పరుగులు చేశాడు. తాజాగా అతని రికార్డును పొలార్డ్ బద్దలుకొట్టాడు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్‌లో అతను ఈ ఘనత సాధించాడు. ఎంఐ న్యూయార్క్ ఆడుతున్న పొలార్డ్ శనివారం వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో 56 బంతుల్లో 100 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ పర్ఫామెన్స్‌తో పొలార్డ్.. గేల్‌ను అధిగమించాడు. 736 మ్యాచ్‌ల్లో 14,582 పరుగులుచేసి టీ20ల్లో అత్యధిక రన్స్‌చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆజాబితాలో పొలార్డ్, గేల్ తర్వాత మూడో స్థానాలో అలెక్స్ హేల్స్(14,449), జోస్ బట్లర్(14,371), డేవిడ్ వార్నర్(14,284), విరాట్ కోహ్లీ(14,218) ఉన్నారు. పొట్టి ఫార్మాట్‌లో 700లకుగాపై మ్యాచ్‌లు ఆడిన ఏకైక ప్లేయర్ పొలార్డే. ఇక, పొలార్డ్ మెరుపు శతకం బాదినప్పటికీ తన జట్టు ఎంఐ న్యూయార్క్‌ను గెలిపించలేక పోయాడు. ఆ మ్యాచ్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్ 30 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా ఆ జట్టు 245/5 స్కోరుగా చేయగా.. ఎంఐ న్యూయార్క్ 215/6 స్కోరుకే పరిమితమైంది.

టీజీ20 లీగ్.. తొలి మ్యాచ్‌లో పాలమూరుపై ఖమ్మం విజయం

విశ్వంభర, హైదరాబాద్: టీజీ20 లీగ్ 2026 ఆరంభమ్యాచ్‌లో అన్విత ఖమ్మంఏసెస్ విజయం సాధించింది. పాలమూరు స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో పాలమూరు 217/6 స్కోరు చేసింది. స్ట్రైకర్స్ ఓపెనర్ విఘ్నేశ్ రెడ్డి (86; 31 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) భారీ ఇన్నింగ్స్‌తోచెలరేగినాఉపయోగం లేకపోయింది. చైతన్య రెడ్డి (35), రోహిత్ రాయుడు (26లి), అఫ్రిది (16), రతన్ (13) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో వేద్ రెడ్డి 2, సీవీ మిలింద్, విద్యానంద రెడ్డి, సాకేత్ ఒక్కో వికెట్ పడగొట్టారు.ఖమ్మం బ్యాటర్లలో వన్‌డౌన్‌లో వచ్చిన హిమతేజ కొడిమెల (59లి; 24 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. ఓపెనర్లు వాఫీ కచ్చి (60; 30 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), జీఎస్‌కే రెడ్డి (52; 32 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా హాఫ్ సెంచరీలు సాధించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 108 పరుగులు జోడించింది. అనంత్ ప్రతీక్ రెడ్డి (25; 17 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. సీవీ మిలింద్ (18), మికిల్ జైస్వాల్ (9) పరుగులు చేశారు. పాలమూరు బౌలర్లలో రవి కిరణ్ 2, నిపుణ్ రెడ్డి, రోహిత్ రాయుడు, అఫ్రిది అహ్మద్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com